సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 24 । మే । 2025



ఆక్రమణల తొలగింపుతో ఉద్రిక్తత

బద్వేలు పట్టణ సుందరీకరణ పనుల్లో బద్వేలు–నెల్లూరు రోడ్డులో దుకాణాల ఎదుట ఆక్రమణల తొలగింపు శుక్రవారం ఉద్రిక్తతకు దారి తీసింది. -10లో



కాశినాయన క్షేత్రానికి పరిష్కారం చూపండి

కాశినాయన క్షేత్రానికి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. -10లో

గరిష్టం/కనిష్టం
39.4/26.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 26.4 – 39.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

భౌతిక శాస్త్ర పరీక్షకు 391 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన భౌతికశాస్త్ర పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 28 పరీక్షా కేంద్రాలకు గాను 3912 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 3521 మంది హాజరు కాగా, 391 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్ 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, డీఈఓ షేక్ షంషుద్దీన్ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు.

27న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కడప నగరంలోని తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీ కంపెనీలో ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. 2023, 24, 25 సంవత్సరాలలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత పొందిన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు 16 ఏళ్లకు పైగా వయసు ఉండాలని, ఎంపికైన వారికి రూ.15000 నుంచి రూ.20,000 వరకు హోదాను బట్టి వేతనం ఉంటుదన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

వెలుగులోకి తామ్ర శాసనం



వెలుగులోకి వచ్చిన తామ్ర శాసనం

కడప కల్చరల్: కడప నగరంలోని స్థానిక ప్రముఖులు శారద ప్రసన్న ఆధీనంలోని తామ్ర శాసనాన్ని శుక్రవారం వెలుగులోకి తెచ్చారు. స్థానిక సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి దీని గురించి ఏపీగ్రఫీ విభాగం డైరెక్టర్ మునిరత్నంరెడ్డి దృష్టికి తీసుకు రాగా, ఆయన శాసనం వివరాలు వెల్లడించారు. 14వ శతాబ్దానికి చెందిన విజయనగరరాజు హరిహర రాయల కాలం నాటి శాసనమని గుర్తించారు. ఇందులో తెలుగుభాషకు సంబంధించిన అక్షరాలతో రాశారని, శక 1283, విజయ, భాద్రపద, శు 7 = 1361 ఆగస్టు 8, ఆదివారం నాటిదన్న వివరాలు ఇందులో కనిపిస్తున్నాయన్నారు. గుత్తి–రాజ్య చిరనది అనే ప్రదేశంలో గల యెదులపల్లి గ్రామానికి పాకనాటి తిమ్మయ అనే వ్యక్తిని గ్రామ నిర్వాహకుడిగా నియమించినట్లు ఉందన్నారు. దాంతోపాటు రాజు గ్రామంలోని అనేక భూములను బహుమతిగా ఇచ్చారని, ఈ వివరాలు కూడా ఇందులో నమోదు చేశారని, ఇంకా ఇచ్చిన భూముల సరిహద్దులను ప్రస్తావించారన్నారు.


ఇటు కరోనా.. అటు మహానాడు

- కోవిడ్‌పై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రభుత్వం హెచ్చరికలు
- మహానాడు భారీగా నిర్వహించేందుకు టీడీపీ కసరత్తు
- వేల మంది ప్రతినిధులతో సమావేశం, 5 లక్షల మందితో బహిరంగ సభ
- రిమ్స్‌లో కరోనా కేసు, అంతలోనే కాదు కాదంటూ బుకాయింపు
- మహానాడు వల్ల విస్తృత వ్యాప్తికి అవకాశం
- జిల్లాలో పెరగనున్న పాజిటివ్ కేసులు



కడపలో ఏర్పాటు చేస్తున్న మహానాడు ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, కడప: కోవిడ్ మహమ్మారి అంటేనే.. పౌరసమాజం గజగజ వణికిపోతుంది. హోదాలు, బలగం, బంధుగణం, ఆర్థిక స్థితి, పలుకుబడి ఇవేవి కాపాడలేని అనుభవాలు.. ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. కళ్ల ముందు తల్లిదండ్రులు, అన్నదమ్ముళ్లు, ఆలుబిడ్డలు, ఆత్మీయులను కోల్పోయిన దుస్థితి. ఒక్కమాటలో చెప్పాలంటే.. మనుషుల ప్రాణాలు తీయడంతోపాటు జీవితాలను అతలాకుతలం చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. అలాంటి కోవిడ్‌ను మూడు విడతల్లో చూశాం. తాజాగా నాలుగో విడత ప్రబలనుంది. ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహించరాదని.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ బుధవారం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మహానాడు నిర్వహణతో కరోనా మరింత ప్రబలే అవకాశం ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పాజిటివ్ కేసులు గణనీయంగా నమోదు కానున్నాయనే భయం ప్రజానీకానికి పట్టుకుంది.



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ సూచనలు

ప్రార్థన మందిరాల సమావేశాలు, సామాజిక సమావేశాలు రాజకీయ పార్టీల సమావేశాలు, ఇతర కార్యక్రమాల వంటివి వాయిదా వేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ కోరారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా వాడాలని పేర్కొన్నారు. జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని స్పష్టం చేశారు. అన్ని పరీక్షల సౌకర్యాలతో కూడిన 24 గంటలు పని చేసే ల్యాబ్‌లలో మాస్కులు, పీపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి పరిస్థితి ఓవైపు ఉంటే.. మరోవైపు మహానాడు ఏర్పాట్లలో ప్రభుత్వ పెద్దలు, తెలుగు తమ్ముళ్లు నిమగ్నమైపోయారు.



మూడు రోజులు మహానాడు

తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు దేశ, విదేశాల నుంచి మహానాడుకు హాజరు కానున్నారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మహానాడులో తొలి, మలిరోజు 23 వేల మంది ప్రతినిధులతో వివిధ అంశాలపై సమీక్ష చేపట్టనున్నారు. చివరి రోజు 5 లక్షల మందితో బహిరంగ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ నేతలు ప్రకటించారు. కోవిడ్ వ్యాప్తి గురించి ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని ఓవైపు ప్రభుత్వమే దిశానిర్దేశం చేసింది. మరోవైపు అందులో కీలక భాగస్వామి అయిన తెలుగుదేశం పార్టీ.. అలాంటి నిబంధనలు ఏమీ పాటించకుండా మహానాడు నిర్వహించేందుకు వేగంగా సన్నహాలు చేస్తోంది.

కడపలో డేంజర్ బెల్స్..

నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన షేక్‌చాంద్ బీబీ(75) అనే వృద్ధురాలు అనారోగ్యంతో కడప రిమ్స్‌లో అడ్మిట్ అయింది. కోవిడ్ టెస్ట్ చేసిన వైద్యులు పాజిటివ్‌గా నిర్ధారించి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయింది. వెంటనే తేరుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోవిడ్ కేసు నమోదు కాలేదని, అదంతా ఉత్తిత్తి ప్రచారమంటూ కొట్టిపారేశారు. అదే వాస్తవం అయితే కోవిడ్ టెస్ట్ రిపోర్టు బహిర్గత పర్చాలి కదా? కోవిడ్ పాజిటివ్ కేసులు దాచి పెట్టడం ఏ మేరకు సబబు? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఓవైపు రిమ్స్ పాలనావిభాగం ప్రత్యేక చికిత్సలు అందిస్తుంటే.. మరోవైపు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా బాధ్యుడు కొట్టిపారేయడం వెనుక మహానాడు జిల్లాలో నిర్వహించ తలపెట్టడమేనని పలువురు వివరిస్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నంలో ఓ కేసు నమోదు అయినట్లు అధికారికంగా ప్రకటించారు. కడపలో నమోదు అయిన కేసును తొక్కి పెట్టారని పలువురు వాపోతున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే తెలుగుతమ్ముళ్లకు కోవిడ్ ఉంటే.. విస్తృతంగా ఇటు జిల్లాలో, అటు రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదని పలువురు వైద్యులు వాపోతున్నారు. కోవిడ్ వ్యాప్తి తర్వాత అప్రమత్తం కావడం కంటే, దాని బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్న వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాలు టీడీపీ మహానాడు మినహాయింపా అనే ప్రశ్న ఉదయిస్తోంది. నిజాయితీగా కోవిడ్ వ్యాప్తి కాకుండా చర్యలు చేపట్టాలంటే.. ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడు నిర్వహణపై సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు.

28న మోడల్ డీఎస్సీ పరీక్ష



డీవైఎఫ్‌ఐ నాయకులతో కలిసి మోడల్ డీఎస్సీ కరపత్రం విడుదల చేస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. కడప డీఈఓ కార్యాలయంలో మోడల్ డీఎస్సీ పరీక్ష కరపత్రాన్ని డీవైఎఫ్‌ఐ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాలు, ఉద్యమాలు వంటివి మాత్రమే కాకుండా నిరుద్యోగులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ఈ పరీక్ష ఎస్జీటీ అభ్యర్థులకు మాత్రమేనని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ ప్రశ్నపత్రాన్ని ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేత తయారు చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు ఈ నమూనా పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కడపలో వెంకట సాయి కోచింగ్ సెంటర్, యూటీఎఫ్ భవన్, ప్రొద్దుటూరు సృజన్ కోచింగ్ సెంటర్, జమ్మలమడుగు ఎస్పీ డిగ్రీ కాలేజీ, బద్వేలు గౌతం కాలేజీ, పోరుమామిళ్ల వర్షా కోచింగ్ సెంటర్‌లు పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కోసం రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు కడప 99127 58515, 966664330, ప్రొద్దుటూరు 80080 87023, జమ్మలమడుగు 9912758515, 91009 95538, బద్వేలు 9059414222, 779950 626227, పోరుమామిళ్ల 824723631 అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడు

- ఘనంగా వైఎస్ రాజారెడ్డి వర్ధంతి
- నివాళులర్పించిన వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి



వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మ సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ, కుటుంబ సభ్యులు

పులివెందుల : దివంగత వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడు అని వైఎస్సార్ సతీమణి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి, పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ రాజారెడ్డి తనయుడు వైఎస్ సుధీకర్ రెడ్డి పేర్కొన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి దివంగత వైఎస్ రాజారెడ్డి 27వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వైఎస్ కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్ సమాధుల తోటలో వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మ సమాధుల వద్ద వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ రాజారెడ్డి తనయుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్ వివేకా సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ పాస్టర్లు ఆనందబాబు, నరేష్‌కుమార్, మృత్యుంజయలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజారెడ్డి పేద ప్రజలకు చేసిన సేవలు, పులివెందుల అభివృద్ధికి ఆయన పాటుపడిన విషయాలను గుర్తుకు తెచ్చుకున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడానికి వైఎస్ రాజారెడ్డి కృషి ఎనలేనిదన్నారు. వైఎస్ కుటుంబం ప్రముఖ స్థానంలో నిలవడానికి ఆయన ఎంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అనంతరం అక్కడే ఉన్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి, దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డిల సమాధుల తోపాటు ఇతర బంధువుల సమాధుల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వైఎస్ జగన్ వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, కిశోర్, వెంగమునిరెడ్డి, పార్నపల్లె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ మాజీ చైర్మన్ నివాళి



వైఎస్ రాజారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో శుక్రవారం దివంగత వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు వైఎస్ రవీంద్రారెడ్డి, మనుమడు వైఎస్ సమరారెడ్డి.. వైఎస్ రాజారెడ్డి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

పటిష్ట బందోబస్తు

ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

కడప అర్బన్: కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న 'మహానాడు' సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పలువురు వీవీఐపీలు, వీఐపీలు, పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్కింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అందరూ అప్రమత్తంగా ఉంటూ.. కేటాయించిన విధులు నిర్వర్తించాలన్నారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

టీడీపీనా... మజాకా!

- ప్రభుత్వ కార్యక్రమాన్ని తలపిస్తున్న మహానాడు
- ప్రొటోకాల్ పేరిట అన్ని ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వారు పనుల్లో నిమగ్నం
- అధికారులు అందుబాటులో లేక ప్రజలు అవస్థలు



మహానాడు ప్రాంగణంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీధర్



ఏర్పాట్లపై టీడీపీ నాయకులతో కలిసి చర్చిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: తొలిసారిగా కడప నగరంలో ఈ నెల 27 నుంచి 29 వరకు తెలుగుదేశం పార్టీ మహానాడు జరగనుంది. ఇది పూర్తిగా ఆ పార్టీకి సంబంధించిన వ్యవహారం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఆ పార్టీ నాయకత్వం చూసుకోవాలి. కానీ అధి కారుల హడావుడి, ఏర్పాట్లను పరిశీలిస్తే.. ఇదేమైనా ప్రభుత్వ కార్యక్రమమా అనే సందేహం ఎవరికైనా కలుగుతుంది. ప్రొటోకాల్ పేరుతో జిల్లా అధికార యంత్రాంగం గత 15 రోజులుగా.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఎవరు ఏ పనులు చేయాలో సూచిస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో అధికారులంతా తమకు అప్పగించిన పనులు పరిపూర్తి చేసేందుకు పరుగులు పెడుతున్నారు. క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు.. ఎవరూ తమ కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రొటోకాల్ అనే ఒకే ఒక పదంతో అధికార పార్టీ రాజకీయ సభ ఏర్పాట్లను అధికారులు భుజానికెత్తుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులకు బాధ్యతలు అప్పగింత

ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర వీఐపీలు ప్రభుత్వం ఏర్పాటు చేసే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాలకు హాజరయ్యే సందర్భాల్లో ప్రొటోకాల్ ప్రకారం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వమే సమకూరుస్తుంది. వీవీఐపీలు ఏదైనా ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తే.. ప్రొటోకాల్ నిబంధనలను అనుసరించి తగిన సెక్యూరిటీతోపాటు కొన్ని సాధారణ ఏర్పాట్లు మాత్రమే చేయాలి. ఇప్పుడు కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు పూర్తిగా రాజకీయ కార్యక్రమం. ఇందులో పాల్గొనేందుకు వచ్చే ముఖ్యమంత్రి, మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులకు సాధారణ, పరిమిత ఏర్పాట్లు మాత్రమే చూడాలి. కానీ అందుకు భిన్నంగా అన్నీ తామై అధికారులు ఏర్పాట్లు చేస్తుండటం విస్మయ పరుస్తోంది. వీఐపీలు ఎయిర్‌పోర్టులో దిగింది మొదలు.. మహానాడు ముగిసి వెళ్లేపోయే వరకు దాదాపు ఏర్పాట్లన్నీ అధికారులే చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ.. కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ఎయిర్‌పోర్ట్‌లో దిగినప్పటి నుంచి వెళ్లే వరకు..

కడప ఎయిర్‌పోర్టులో దిగే వీఐపీలకు సంబంధించి ప్రొటోకాల్ ఏర్పాట్లు జమ్మలమడుగు ఆర్డీఓ, కడప మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. విమాన సిబ్బంది, ఇతరుల ఏర్పాట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చూడాలి. సెక్యూరిటీ ఇన్‌చార్జిగా కడప డీఎస్పీ, వైద్య సదుపాయాల ఏర్పాటు బాధ్యత జీజీహెచ్ సూపరింటెండెంట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి అప్పగించారు. స్టేట్ గెస్ట్‌హౌస్, ఆర్‌అండ్‌బీ, హరిత హోటల్ ఓవరాల్ ఇన్‌చార్జి బాధ్యతలు పులివెందుల ఆర్డీఓకు అప్పగించారు. మళ్లీ ఒక్కో గెస్ట్‌హౌస్‌కు ఒక్కో డివిజన్ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇవి కాకుండా జిల్లాలో ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లు, ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లకు సూపర్‌వైజింగ్, ఇన్‌చార్జి, సపోర్టింగ్ అధికారులకు జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్, ఆర్డీఓ, ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను నియమించారు. మహానాడుకు వచ్చే 23 మంది మంత్రులకు 23 మంది లైజన్ అధికారులను ఏర్పాటు చేశారు. మంత్రుల పర్యటన ముగిసే వరకు ఇన్నోవా క్రిస్టా (ఏసీ) కార్లు, బస, ఆహారం వంటివి ఆయా అధికారులు చూడాలి. ముఖ్యమంత్రి, మంత్రుల కాన్వాయ్ వాహనాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఏర్పాటు చేయాలి. ఇందుకు అవసరమైన ఇంధనాన్ని కడప తహసీల్దార్ సమకూర్చాలి. నగరంలోని మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి ముఖ్యమంత్రి తదితరులు పూలమాలలు సమర్పించే ఏర్పాట్లను నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు అప్పగించారు. బారికేడింగ్ ఏర్పాటు బాధ్యతను ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి అప్పగించారు. వీఐపీలు పర్యటించే మార్గాల్లో పారిశుద్ధ్యం, సుందరీకరణ పనులు కడప మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి చూడాలి. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, మీడియాకు రిఫ్రెష్‌మెంట్స్ బాధ్యత సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులకు అప్పగించారు.

మహానాడు ప్రాంగణంలో..



మహానాడు నిర్వహించే ప్రాంగణంలో కూడా చాలా మేరకు బాధ్యతలను అధికారులకు అప్పగించారు. సభా వేదిక ఇన్‌చార్జి, ఆఫీసు సెటప్, మీటింగ్ రూము ఏర్పాట్లు కడప ఆర్డీఓ, కమలాపురం తహసీల్దార్ చూడాల్సి ఉంటుంది. బ్యారికేడింగ్, స్టేజ్ ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి అప్పగించారు. గ్రీన్ రూము ఏర్పాటు బాధ్యత బద్వేలు ఆర్డీఓ, పోరుమామిళ్ల తహసీల్దార్ చూడాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, సిబ్బందికి అవసరమైన భోజనాలు, ఇతర ఏర్పాట్లు సీకే దిన్నె తహసీల్దార్‌కు అప్పగించారు. విధి నిర్వహణలోని అధికారులు, సిబ్బంది భోజనాల బాధ్యతను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, డీఎస్ఓలకు అప్పగించారు. తాగునీటి సరఫరా బాధ్యతను కడప మున్సిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నిర్వహించాల్సి ఉంటుంది. మహానాడు గ్యాలరీ ఇన్‌చార్జిలుగా వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, వీఆర్వోలు, జూనియర్ ఇంజనీర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలు, వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లకు అప్పగించారు. పరికరాలతో సహా వీడియో కాన్ఫరెన్స్ సెటప్ జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి (ఎన్‌ఐసీ)కి అప్పగించారు. ఇంటర్నెట్, లాంగ్ కనెక్షన్ వంటి పనులు బీఎస్‌ఎన్‌ఎల్, ఏపీ ఫైబర్ నెట్ అధికారులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ నిధులతో సోకులు

ఇవన్నీ చూస్తుంటే తెలుగుదేశం పార్టీ నాయకులు చేయాల్సిన పనులన్నీ అధికారులు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిధులతో మహానాడుకు సోకులు చేయడం లాంటివి గతంలో ఎక్కడా జరగలేదని పలువురు అంటున్నారు. ప్రొటోకాల్ పేరుతో రాత్రింబవళ్లు తమను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారని, తమకు అప్పగించిన పనులకు అయ్యే ఖర్చులు ఎవరు ఇస్తారంటూ అధికారులు వాపోతున్నారు. మహానాడు పనుల్లో అధికారులు నిమగ్నం కావడం వల్ల.. వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

తీగలు తగిలి గేదె మృతి



విద్యుద్ఘాతానికి గురై చనిపోయిన గేదె

సింహాద్రిపురం : మండలంలోని అహోబిలం గ్రామానికి చెందిన గంగిరెడ్డికి చెందిన గేదె విద్యుత్తు షాక్‌కు గురై మృతిచెందింది. గ్రామానికి చెందిన గంగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజారెడ్డి, రవీంద్రనాథరెడ్డి తమ గేదెలను సమీపాన ఉన్న చెరువు గట్టున మేపుకొనేందుకు తీసుకెళ్లారు. గంగిరెడ్డికి చెందిన గేదె అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. రూ.92వేలు నష్టపోయానని బాధిత రైతు గంగిరెడ్డి తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

జమ్మలమడుగు రూరల్ : ఇంటి ముంగిట పేడ నీళ్లు చల్లుకునే విషయంలో జరిగిన ఘర్షణలో శుక్రవారం ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. ఈ నెల 10న మండలంలోని పి.బొమ్మేపల్లిలో పేడనీళ్లు చల్లుకునే విషయంలో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. పరస్పరం దాడులు చేసుకోవడంతో గాయాలపాలైన రాజ చౌడప్ప మృతి చెందాడు. ఈ హత్య కేసులో ఇదివరకే నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం బొగ్గు నడిపి సుబ్బరాయుడు, అతడి కుమారుడు నడిపి సుబ్బరాయుడు, నాగంజి అనులను ఆదివారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

డేంజర్ జోన్‌లో క్వారీకి ఎలా అనుమతిస్తారు ?



క్వారీని పరిశీలిస్తున్న ఏడీ సుబ్రహ్మణ్యం

ఓబులవారిపల్లె : డేంజర్ జోన్‌గా ప్రకటించినప్పటికీ.. ఏపీఎండీసీ మంగంపేట గనికి 500 మీటర్ల దూరంలో కంకర క్వారీకి ఎలా అనుమతిస్తారని గోవిందంపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా తమ పంటలు నష్టపోతున్నామని మైన్స్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయడంతో అన్నమయ్య జిల్లా మైన్స్ ఏడీఎం సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి శుక్రవారం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారితో మాట్లాడుతూ కంకర క్వారీలో నిర్వహించే భారీ పేలుళ్ల కారణంగా వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కాలుష్యంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని, శ్వాసకోశ, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధుల బారిన పడి చాలామంది మృతి చెందారని ఆరోపించారు. తమ ఆస్తులు అమ్ముకున్నా ఆసుపత్రులకు సరిపోదని వారు వాపోయారు. గోవిందంపల్లి ప్రజలను కాపాడాలని, చర్యలు తీసుకోకపోతే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఏడీ సుబ్రమణ్యం కంకర క్వారీ క్రషర్‌లను పరిశీలించి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామ సుబ్రహ్మణ్యం, సింగ్, గోపీనాథ్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుతో ఉద్రిక్తత

- మున్సిపల్ సిబ్బందితో టీడీపీ నేత వాగ్వాదం
- కమిషనర్‌పై తీవ్ర పదజాలంతో నేత ఆగ్రహం



మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బద్వేల్–నెల్లూరు రోడ్డులోని దుకాణాల ఎదుట ఆక్రమణల తొలగింపు శుక్రవారం ఉద్రిక్తతకు దారి తీసింది. మున్సిపాలిటీని ముంచ మోపించేందుకే వచ్చాడంటూ టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌పై తీవ్ర పదజాలంతో విరుచుకుపడే పరిస్థితి తలెత్తింది. వివరాల్లోకి వెళ్తే.. బద్వేల్ పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ వివి.నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారి సతీష్, సిబ్బంది నరసయ్య ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న బోర్డులు, రేకుల షెడ్డులను తొలగించే పనులు చేపట్టారు. ఈ సమయంలో ఓ దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు తొలగించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టీడీపీ మున్సిపాలిటీ నాయకుడు మిత్తికాయల రమణ అక్కడికి చేరుకుని మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీల ద్వారా ముందస్తు సమాచారం ఇచ్చామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చెబుతున్నప్పటికీ వినిపించుకోకుండా వారిపై చిందులేశాడు. అంతటితో ఆగకుండా ఈ కమిషనర్ బద్వేల్ మున్సిపాలిటీని ముండమోపించేందుకే వచ్చాడు.. నాశనం చేసి పోతాడు అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. మీరు మనుషులను తీసుకువచ్చి ఇలా చేయడం సరికాదని సిబ్బంది అనగా.. మనుషులను పంపిస్తే పరిస్థితి ఇలా ఉండదంటూ బెదిరింపులకు దిగారు. సిబ్బంది చేసేదిలేక ఆక్రమణల తొలగింపు నిలిపేసి వెనుదిరిగారు. జరిగిన విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకుపోవడంతో పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలగించారు. మున్సిపల్ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తూ వారిని ఇష్టానురీతిలో మాట్లాడినప్పటికీ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ ఉద్యోగుల మనోభావాలు, ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని కొందరు ఉద్యోగులు చర్చించుకోవడం కనిపించింది.

ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయం మేరకే గదుల కూల్చివేత



మాట్లాడుతున్న రెవరెండ్ యు.సాల్మన్

కడప కల్చరల్ : సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయం మేరకే సీఎస్ఐ బాయ్స్ హాస్టల్ గదులను కూల్చివేశామని సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ వైస్ చైర్మన్ రెవరెండ్ యు.సాల్మన్, సెక్రటరీ రెవరెండ్ సి.సాల్మన్, అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ పీఎస్.వినయ్‌కుమార్ తెలిపారు. సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ కార్యాలయంలో విలేరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ స్కూల్ నడుపుకొనేందుకు షర్మిలకు తాము ఎలాంటి లీజు ఇవ్వలేదని, అగ్రిమెంట్ చేసుకోలేదని స్పష్టం చేశారు. గతంలో న్యూ మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు ఇచ్చిన లీజు గడువు పూర్తవగా.. వారు తమకు అప్పగించారన్నారు. తమకు తెలియకుండా షర్మిల లీజ్ ఒప్పందం కుదుర్చుకుని నడుపుతోందన్నారు. బాయ్స్ హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరాయని, భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదం జరగకూడదని భావించి గదులు కూల్చే ప్రయత్నం చేశామన్నారు. షర్మిలకు ఏడాది కాలం విద్యా సంస్థ నడుపుకొనేందుకు అంగీకరించామని, మూడేళ్లు గడచినా ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతోందని వారు తెలిపారు. ఇందులో సీఎస్ఐ రాయల సీమ డయాసిస్ పీఠాధిపతి డాక్టర్ ఐజక్ వరప్రసాద్, ఆయన కుమారుడి పాత్ర లేదన్నారు. అవాస్తవాలు చిత్రీకరించి తప్పుడు కేసు పెట్టారని వివరించారు.

పోలీస్ బైక్ దొరికింది

ప్రొద్దుటూరు క్రైం : కర్నాటక వాసి ఎత్తుకెళ్లిన బ్లూకోల్ట్స్ బైక్ దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిని బుధవారం రాత్రి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అతడిని విచారించగా మతిస్థిమితం లేని వ్యక్తిగా నిర్ధారణ అయింది. ఉదయం ఇంటికి పంపాలని పోలీసులు అతన్ని స్టేషన్‌లోనే పెట్టుకున్నారు. ఈ క్రమంలో గురువారం వేకువ జామున స్టేషన్‌లో నుంచి బ్లూకోల్ట్స్ బైక్‌తో పరారైన విషయం పాఠకులకు విదితమే. అయితే పట్టణ శివారు ప్రాంతంలో పడేసి వెళ్లిన బ్లూకోల్ట్స్ బైక్‌ను గురువారం ఉదయం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నాటకు వాసిని కూడా అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యువకుడిపై కత్తితో దాడి



గాయపడ్డ శివరామక్రిష్ణారెడ్డి

కలసపాడు : బాకీ చెల్లించే విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. ఋమండలంలోని ఎగువరామాపురం గ్రామానికి చెందిన తవ్వా శివరామక్రిష్ణారెడ్డి అదే గ్రామానికి చెందిన అంకిరెడ్డికి డబ్బు బాకీపడ్డాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య కొంత కాలంగా వివాదం జరుగుతోంది. గురువారం రాత్రి ఈ విషయంపై మాట్లాడేందుకు శివరామక్రిష్ణారెడ్డి ఇంటి వద్దకు వెళ్లిన అంకిరెడ్డి ఆయన తల్లి నారాయణమ్మ, తదితరులను అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ విషయం తెలుసుకుని ఆగ్రహానికి గురైన శివరామక్రిష్ణారెడ్డి, తన తల్లిని తీసుకుని అంకిరెడ్డి ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అంకిరెడ్డి కత్తితో శివరామక్రిష్ణారెడ్డిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు తిరుపతి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు శివరామక్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అంకిరెడ్డిని అరెస్టు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడికి యత్నం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని తాళ్లమాపురం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులుపై టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ దాడికి యత్నించడంపై శుక్రవారం ఉద్యోగులలో చర్చ జరిగింది. లింగాపురం గ్రామంలోని శ్రీనివాసులుకు చెందిన సూపర్ మార్కెట్‌కు శుక్రవారం రాత్రి టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ మద్యం తాగి వచ్చారు. శ్రీనివాసులుపై దాడి చేసేందుకు యత్నించాడని సూపర్ మార్కెట్ సిబ్బంది పేర్కొన్నారు. కొన్ని నెలలుగా కూలీల వద్ద అవహేళనగా మాట్లాడుతూ తనను చిత్రహింసకు గురిచేస్తున్నాడని ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్లమాపురం సమీపంలోని కేసీ కెనాల్‌లో పూడికతీత పనులు, కంపచెట్ల తొలగింపునకు ప్రతిపాదనలు పంపాలని టెక్నికల్ అసిస్టెంట్‌ను కోరానన్నారు. ఆ ప్రతిపాదనలను పంపకపోవడంతో ప్రశ్నించానని, తనపై కుర్చీతో దాడి చేయబోయాడని అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డిని వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని, సోమవారం విచారించి చర్యలు తీసుకుంటానన్నారు.

గుండంలో పడి అఘోరి మృతి

చిట్వేలి : నగిరిపాడు పంచాయతీ పెద్దూరు అటవీ ప్రాంతంలోని గుండాలకోన గుండంలో పడి అఘోరి మృతిచెందింది. శివరాత్రి సందర్భంగా ఆమె గుండాల కోనను సందర్శించి..ఐదురోజుల తర్వాత తిరిగి వెళ్లినట్లు సమాచారం. మళ్లీ గురువారం గుండాలకోనకు వచ్చి నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లినట్లు భక్తులు తెలిపారు. అనంతరం శుక్రవారం గుండంలో శవమై తేలింది. అటవీ సమీప గ్రామాల ప్రజలు ఈ విషయం స్థానిక పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని వెలికితీయించారు. అఘోరికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో మృతదేహాన్ని కోడూరు మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. అఘోరికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే చిట్వేలి స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరుతున్నారు. పూర్తి వివరాలకు ఎస్ఐ 9121100579, సీఐ 9121100576 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న అర్బన్ సీఐ రమణారెడ్డి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

మైదుకూరు : బైక్‌ల చోరీపై పోలీసులు చేపట్టిన నిఘాతో ఏకంగా ఇద్దరు అంతర్ జిల్లాల బైక్ దొంగలు శుక్రవారం మైదుకూరు అర్బన్ పోలీసులు పట్టుబడ్డారు. వైఎస్సార్, నంద్యాల, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో చోరీ చేసిన ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ కేవీ.రమణారెడ్డి వివరాల మేరకు.. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన కొప్పోలి జాయ్, ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లె గ్రామానికి చెందిన చాపాటి పవన్, మరో ముగ్గురు మైనర్లతో కలిసి చోరీలకు అలవాటు పడ్డారు. మైదుకూరు, అన్నమయ్య జిల్లా రాయచోటి, అనంతపురం జిల్లా తాడిపత్రి, నంద్యాల జిల్లా చాగలమర్రి, సిరివెళ్ల, కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌లను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిఘా పెట్టిన పోలీసులు మైదుకూరు- ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులోని వంతెన వద్ద ఇద్దరినీ అరెస్టు చేశారు. మరో ముగ్గురు మైనర్లు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. రూ.10 లక్షల విలువలైన 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, వెంకటకిరణ్, ప్రసాద్‌రాజు, శివగణేష్, నవీన్, తిరుమలయ్య, ప్రసాద్‌లను డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అభినందించారని సీఐ పేర్కొన్నారు. వారికి రివార్డులు అందజేస్తామన్నారు. బైక్‌లను పార్కు చేసే సమయంలో సైడ్ లాక్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, ఏఎస్ఐలు శివప్రసాద్ రెడ్డి, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు



ప్రశాంతి చేతిని కరిచిన పిచ్చి కుక్క

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని బస్టాండు సమీపంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గత మూడు రోజులుగా ప్రయాణికులపై దాడి చేస్తూ ఆందోళనకు గురి చేస్తోంది. శుక్రవారం కొత్త బస్టాండ్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ప్రశాంతిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. అంతటితో ఊరుకోకుండా ప్రయాణికులపైకి దూసుకెళ్లి అరవడంతో భయపడిపోయారు. అధికారులకు ఈ విషయం చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారేగానీ చర్యలు తీసుకోవడంలేదు. కుక్కను పట్టి తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

గుర్రంకొండ : పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మండలంలోని మర్రిమాకులపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటేష్, సుమలతల కుమార్తె వర్షిత(16) స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివింది. పది పరీక్ష ఫెయిల్ కావడంతో గుర్రంకొండ తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు వచ్చింది. రాసిన అనంతరం ఇంటికి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు గుర్రంకొండకు చేరుకొని వాకబు చేశారు. రెండు రోజులుగా విద్యార్థిని ఆచూకీ కోసం గాలించినా కనపడకపోవడంతో ఆమె తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు.

370 లీటర్ల సారా ఊట ధ్వంసం

మదనపల్లె రూరల్ : బి.కొత్తకోట మండలంలో దాడులు జరిపి 370 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం సుబ్బిరెడ్డిగారిపల్లెలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారని తెలిపారు. జి.కృష్ణప్ప కుమారుడు జి.రవికుమార్(30), టి.సుబ్బయ్య కుమారుడు టి.ఆనంద్(34), అదే గ్రామానికి చెందిన కె.వెంకటరమణ(70)లు సారా విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతోపాటు తయారీకి సిద్ధంగా ఉంచిన 370 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ముగ్గురు వ్యక్తులపై వేర్వేరుగా కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, దార్కస్, కానిస్టేబుళ్లు మధుసూదన్, వెంకటేష్, నాగరాజు, మధు పాల్గొన్నారు.

మహిళకు తీవ్రగాయాలు



గాయపడిన మహిళ

మదనపల్లె రూరల్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. గుర్తుతెలియని మహిళ(60) బసినికొండ, కొండామర్రిపల్లెలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే భిక్షాటనకు వెళుతుండగా.. కొండామర్రిపల్లె రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు బసినికొండ మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో మహిళా పోలీస్ బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఉక్కు పరిశ్రమపై టీడీపీ వైఖరిని తెలియజేయాలి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి



కడప ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నారాయణరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై మహానాడులో కూటమి నాయకులు స్పష్టమైన హామీ ఇవ్వాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటిరాజా, కడప పార్లమెంటు అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిలను శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ బెంగళూరు–కడప రైల్వే పనులు అమరావతి వరకూ పొడిగించాలని కోరారు. ఉక్కు పరిశ్రమపై రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. రాష్ట్ర ప్రయోజనాలకోసం ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటయితే ఉపాధి అవకాశాలు లభిస్తాయని యువకులు ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు స్పందించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సగిలి గుర్రప్ప, శ్రీనివాసులు, జయవర్ధన్, కృష్ణ, డబ్ల్యూ రాము, రసూల్,గోపి, నాగేంద్ర, జగదీశ్, నాగరాజు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సహకారంతో సూపర్ సిక్స్ పథకాల అమలు

విలేకరులతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప రూరల్ : ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల ద్వారా వైఎస్సార్‌సీపీ కనుమరుగవుతుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి జోస్యం చెప్పారు. కడప ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ లిక్కర్‌కు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్, వైఎస్.అవినాష్ రెడ్డి పలు అంశాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్నారని అన్నారు. లిక్కర్‌తో పాటు ఇతర అవినీతి, ఆరోపణలపై మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అరెస్టవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చకు సిద్ధమని చెప్పినా కాల్చేయడం దారుణం



విలేకరులతో మాట్లాడుతున్న ఓబులేసు యాదవ్

కడప ఎడ్యుకేషన్ : మావోయిస్టులు శాంతి చర్చలు కోరుతున్నా.. ఆపరేషన్ కగార్ పేరిట చత్తీస్‌ఘడ్, బస్తర్ అడవుల్లో మారణకాండ సాగించడం దారుణమని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం.ఓబులేసుయాదవ్ పేర్కొన్నారు. కడప విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ పేరుతో సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి సంబాల కేశవరావు, మరింతమంది మావోయిస్టులు, ఆదివాసీలను కాల్చి చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్ట విరుద్ధంగా సాగిన హత్యాకాండపై న్యాయ విచారణ చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రజా సంఘాల నిరసన ప్రయత్నాన్ని భగ్నం చేసి, పోలీసులు హడావుడి చేస్తున్నారని, ప్రజల హక్కులపై ఆంక్షలు విధించవద్దని విజ్ఞప్తి చేశారు.

కాశినాయన క్షేత్రానికి శాశ్వత పరిష్కారం చూపండి



కిషన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : జ్యోతి క్షేత్రంలోని కాశినాయన ఆలయానికి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి సమస్య విన్నవించారు. ఇటీవల జ్యోతి క్షేత్రంలో భవనాలను అటవీ అధికారులు కూల్చి వేశారని, ఆలయ నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయిందని విన్నవించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తులు, ప్రయత్నాలకు కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. కాశినాయనకు కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో లక్షలాది కాశినాయక భక్తులున్నారని, కూల్చివేతలపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు.

కూటమి పాలనలో ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత



మీడియాతో మాట్లాడుతున్న పూల నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత ఉంటుందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సముదాయ భవనంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించామన్నారు. ఉద్యోగులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్స్‌కు ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇస్తున్నారని, అదే తరహాలో చిత్తూరు, మంత్రాలయం రూట్లలోని కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని ఆ రాష్ట్ర రవాణాశాఖ మంత్రిని కలిసి కోరడం జరిగిందన్నారని పూల నాగరాజు తెలిపారు. ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగాగదులు, బాత్‌రూములను ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు.ఈ సమావేశంలో ఆర్టీసీ కార్మిక పరిషత్‌జోనల్ నాయకులు పురుషోత్తం పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన వివాహిత రాణి

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, రెండో భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కర్నాటక రాష్ట్రం చింతామణికి చెందిన రాణి(30) భర్తతో అభిప్రాయభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. ఆమెకు కుమారుడు సుమిత్(12), కుమార్తె లేఖన(6) ఉన్నారు. మూడేళ్ల కిందట సత్యసాయిజిల్లా పాలసముద్రం మండలం బోయలపల్లెకు చెందిన డ్రైవర్ అశోక్‌తో బెంగళూరులో సహజీవనం చేస్తోంది. కాగా, అశోక్‌కు ఇటీవల అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకు చెందిన మౌనీషాతో వివాహమైంది. ఆమె ప్రస్తుతం గర్భిణి కావడంతో పుట్టింట్లో ఉంది. కొద్ది రోజుల కిందట అశోక్‌కు కాలు విరగడంతో రాణి సాయంతో చికిత్స తీసుకుని స్వగ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యుల సూచనతో రాణి బెంగళూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రాణికి ఫోన్ చేసిన అశోక్.. నన్ను వదిలి వెళ్లిపోతావా అంటూ గొడవ పడ్డాడు. దీంతో కుమార్తెతో కలిసి రాణి అశోక్‌ను కలుసుకునేందుకు రాగా ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆగ్రహంతో రాణిపై అశోక్ చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందింది. ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న కోమటివానిచెరువు కట్ట సమీపంలోని రోడ్డుపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఏఎస్ఐ రమణ ఆమె నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అశోక్‌ను తాను రెండో వివాహం చేసుకున్నానని, తనపై అనుమానంతో నిత్యం వేధిస్తున్నాడని తెలిపింది. చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ లింగప్ప

జమ్మలమడుగు రూరల్ : మండలం లోని ముద్దనూరు రహదారిలో ఈ నెల 18న హత్యకు గురైన చెన్నంశెట్టి మల్లికార్జున (32) కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ లింగప్ప వివరాల మేరకు.. చెన్నంశెట్టి మల్లిఖార్జున, అతడి భార్య సరోజ మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. అంత కంటే ముందుగా సరోజతో గొడవపడిన భర్త చెన్నంశెట్టి మల్లిఖార్జున తన ఇంటి నుంచి గెంటివేశాడు. దీనిని దృష్టిలో పెట్టుకున్న సరోజ సోదరుడు వినోద్‌కుమార్ మల్లిఖార్జునపై ఆగ్రహంతో ఉన్నాడు. ఈ నెల 18న బావ చెన్నంశెట్టి మల్లిఖార్జున జమ్మలమడుగుకు రావడంతో కొత్తరోడ్డు సమీపంలో వినోద్ తన కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్ట్‌లో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.